ప్రజలకు శుభాలు కలుగాలి

క్రైస్తవులకు కేసీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): క్రిస్మస్‌ను పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు శుభాలు కలుగాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. యేసు జన్మదినాన్ని క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని చెప్పారు. శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తుబోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని పేర్కొన్నారు. ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. తెలంగాణ క్రైస్తవులకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ఇంటిలో స్వేద పత్రం విడుదల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను టీవీలో చూస్తున్న కుటుంబ సభ్యులు

స్వేదపత్రంపై ప్రజల్లో ఆసక్తి

- గంటన్నరపాటు కేటీఆర్ ప్రజెంటేషన్
- చెవులొగ్గి విన్న తెలంగాణ సమాజం

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో సాధించిన ప్రగతి ప్రస్థానంపై కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ శ్వేతపత్రాల పేరుతో అబద్ధాలు ప్రచారం చేసిందని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. శ్వేతపత్రాలకు దీటుగా స్వేదపత్రాన్ని విడుదల చేసింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ఆదివారం తెలంగాణ భవన్‌లో 'స్వయం పాలన ప్రారంభమైన అనతికాలంలో కేసీఆర్ ప్రభుత్వ దార్శనికతతో యావత్ తెలంగాణ ప్రజలు చెమటోడ్చి సృష్టించిన సంపద'పై స్వేదపత్రం విడుదల చేస్తున్నాం' అంటూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ ప్రగతిని 44 స్లైడ్స్‌తో కేటీఆర్ చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మీడియా ప్రతినిధులుసహా పార్టీ నేతలు ఆసక్తిగా విన్నారు. 11:27 గంటల నుంచి 12:57 వరకు ప్రజెంటేషన్, ఆ తరువాత మరో 5 నిమిషాలపాటు మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలిచ్చారు. మాజీ మంత్రులు, పార్టీ నేతలు కేటీఆర్ ప్రజెంటేషన్ చూసి, ఆయన చెప్పే విధానానికి ముగ్ధులయ్యారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు సామాజిక మాధ్యమాల్లో లైవ్ కవరేజ్ కావడంతో తెలంగాణ సమాజం ఆసక్తిగా తొలకించింది. మరోవైపు కేటీఆర్ విడుదల చేసిన స్వేదపత్రంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్నది. మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్, ఎంపీలు మాలోత్ కవిత, బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, రేగా కాంతారావు, మెతుకు ఆనంద్, బేతి సుభాష్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, పార్టీ నేతలు చెల్మడ లక్ష్మీనర్సింహారావు, దాసోజు శ్రవణ్, పీఎల్ శ్రీనివాస్, రవిసూర్యసహా పార్టీ నేతలు, శ్రేణులు పాల్గొనడంతో తెలంగాణభవన్ కిక్కిరిసిపోయింది.

50 లక్షల కోట్ల సంపద సృష్టించాం

రాష్ట్ర అప్పు రూ.3,17,015 కోట్లే • దీనితో పోలిస్తే ఆస్తులు 16 రెట్లు వృద్ధి • రాష్ట్రమంతటా భారీగా పెరిగిన భూముల విలువ

రూ.6,71,757 కోట్ల అప్పు అసత్య ప్రచారమే

ఐదు విప్లవాలతో రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చాం

- అంకెల గారడీతో లేని అప్పును చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- తెలంగాణను విఫల రాష్ట్రంగా చిత్రీకరించేందుకు కుట్ర
- 'స్వేదపత్రం' పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ఉద్యమ నేత కేసీఆర్ సారథ్యంలోని గత ప్రభుత్వం రాష్ట్ర సంపదను భారీగా పెంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారక రామారావు స్పష్టం చేశారు. గత తొమ్మిదిన్నర ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.3,17,015 కోట్ల అప్పు చేసిందని, అదే సమయంలో దాదాపు రూ.50 లక్షల కోట్ల సంపదను సృష్టించిందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'స్వేదపత్రం' పేరుతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం తెచ్చిన అప్పులతో పోలిస్తే దాదాపు 16 రెట్లు అధికంగా ఆస్తుల కల్పన జరిగిందని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం భారీగా అప్పులు తెచ్చినట్టు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. గత తొమ్మిదిన్నర ఏండ్లలో తెలంగాణ రూ.6,71,757 కోట్లు అప్పు తెచ్చిందంటూ అంకెల గారడీలు, అభాండాలతో రేవంత్ సర్కారు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. ప్రస్తుతం ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోని రాష్ట్ర అప్పులను రూ.3,89,673 కోట్లుగా, అందులో 2013-14 నాటికి ఉన్న అప్పులను రూ.72,658 కోట్లుగా ఇటీవల అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొన్నదని కేటీఆర్ తెలిపారు. ఈ లెక్క ప్రకారం కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.3,17,015 కోట్లు మాత్రమేనని వివరించారు. ఈ వాస్తవాన్ని కప్పిపు రేవంత్ సర్కారు కప్పిపుచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు దివాలాకోరు ప్రయత్నాలు చేస్తున్నదని నిప్పులు చెరిగారు.

ఎన్నో ఆస్తులను సృష్టించాం

రాష్ట్రంలో వ్యవసాయ, విద్యుత్తు, నీటిపారుదల రంగాల అభివృద్ధికి గత తొమ్మిదన్నర ఏండ్లలో ఎంతో కృషి చేశామని, విద్యుత్తు రంగంలో రూ.1,37,517 కోట్లు ఖర్చు చేసి.. రూ.6,87,585 కోట్ల విలువైన ఆస్తులను సృష్టించామని కేటీఆర్ వివరించారు. సాగు విస్తీర్ణాన్ని 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.68 కోట్ల ఎకరాలకు వరిధాన్యం ఉత్పత్తిని 68 లక్షల టన్నుల నుంచి 350 లక్షల టన్నులకు పెంచామని తెలిపారు. ఐదు విప్లవాలతో ఎన్నో అద్భుతాలు సాధించామని చెప్పారు. శ్వేతవిప్లవంతో పాల ఉత్పత్తిని 4.2 నుంచి 5.8 మిలియన్ టన్నులకు పెంచామని పేర్కొన్నారు. గులాబీ విప్లవంతో గొర్రెల సంఖ్య 12.8 నుంచి 19.1 మిలియన్లకు పెరిగిందని, నీలి విప్లవంతో చేపల ఉత్పత్తిని 2.68 నుంచి 3.90 లక్షల టన్నులకు పెంచడం ద్వారా దాదాపు రూ.30 వేల కోట్ల సంపదను సృష్టించామని తెలిపారు. పసుపు విప్లవంతో ఆయిల్‌పామ్ సాగును 27,376 ఎకరాల నుంచి 20 లక్షల ఎకరాలకు పెంచామని చెప్పారు. వీటితోపాటు గ్రామాల అభివృద్ధి, భూగర్భ జలాలను పెంచడం, సాగునీటి వసతులను మెరుగుపర్చడంతో భూముల విలువ ఎన్నోరెట్లు పెరిగిందని వివరించారు. రాష్ట్రంలో 1.52 కోట్ల ఎకరాల పట్టా భూములకు రైతుబంధు ఇవ్వడంతో ఆ భూముల విలువ ఎన్నో రెట్లు పెరిగిందని తెలిపారు. తెలంగాణలో పెరిగిన సంపదను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేస్తే.. రాష్ట్ర భవిష్యత్తు మరింత అద్భుతంగా ఉంటుందని హితబోధ చేశారు.

బడ్జెట్ రుణాలు

పాత బడ్జెట్ రుణాలు	రూ.72,658 కోట్లు
కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు	రూ.3,17,015 కోట్లు
ప్రస్తుతం మొత్తం బడ్జెట్ అప్పులు	రూ.3,89,673 కోట్లు
కొన్ని ప్రధాన బడ్జెటేతర రుణాలు	
ప్రభుత్వ గ్యారెంటీ ఉన్నవి (ఎస్‌పీవీ)	రూ.1,27,208 కోట్లు
ప్రభుత్వ హామీ లేని రుణాలు	రూ.59,414 కోట్లు

తొమ్మిదిన్నర ఏండ్లలో అగ్రస్థానంలో ఆర్థిక ప్రగతి

తెలంగాణ అతి తక్కువ సమయంలోనే సుసంపన్న రాష్ట్రంగా అవతరించిందని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి ఛిన్నాభిన్నంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక రంగం పరిపుష్టమైతేనే ఉద్యమ నినాదమైన 'నిధులు, నీళ్లు, నియామకాలు' సాకారమవుతాయని భావించామని, అందుకే తెలంగాణ ఆదాయ వనరులను మెరుగుపరిచేందుకు ప్రముఖ ఆర్థికవేత్త జీఆర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించి పటిష్ఠ ఆర్థిక ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగి ఎన్నో అద్భుతాలు సాధించామని తెలిపారు. తెలంగాణ ఏర్పడే నాటికి 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.1,12,162గా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయాన్ని తొమ్మిదిన్నర ఏండ్లలో రూ.3,17,115కు పెంచామని, ఇదే సమయంలో జీఎస్‌డీపీని రూ.4.51 లక్షల కోట్ల నుంచి రూ.13.27 లక్షల కోట్లకు పెంచగలిగామని గుర్తు చేశారు. ఈ వాస్తవాలను కాంగ్రెస్ ప్రభుత్వం కప్పిపుచ్చి రాష్ట్రం అప్పుల పాలైనట్టు అసత్య ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్థికంలో దేశానికే ఆదర్శం

అంశం	2013-14	2022-23
తలసరి ఆదాయం	రూ.1,12,162	రూ.3,17,115
జీఎస్‌డీపీ	రూ.4.51 లక్షల కోట్లు	రూ.13.27 లక్షల కోట్లు

అస్థిత్వాన్ని, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే కుట్ర

బీఆర్ఎస్‌పై అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అస్థిత్వాన్ని, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా అసత్యాలను ప్రచారం చేస్తున్నదని, తెలంగాణను విఫల రాష్ట్రంగా చూపేందుకు విఫలయత్నం చేస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. అందులో భాగంగా ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలతోపాటు గ్యారంటీ ఇవ్వని రుణాలను కూడా అప్పులుగా చూపుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి స్థూలంగా ఉన్న రుణాలు రూ.3,17,051 కోట్లు మాత్రమేనని, దీనికి విరుద్ధంగా రేవంత్ సర్కారు లేని అప్పును ఉన్నట్టు చూపి తిమ్మిని బమ్మిని చేస్తున్నదని ధ్వజమెత్తారు. బడ్జెట్ రుణాలతోపాటు స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) కింద తీసుకున్న రుణాలను సైతం ప్రభుత్వ అప్పుగానే చూపే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఉదాహరణకు.. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల లాంటి వాటిని నిర్మించాలంటే ప్రభుత్వ గ్యారెంటీలతో సంబంధం లేకుండానే రుణాలు ఇస్తారని, ఆ తర్వాత ఆ సంస్థలే ఆ అప్పులను తీర్చేస్తాయని చెప్పారు. ఇలా రాష్ట్రంలో అనేక కార్పొరేషన్లు, సంస్థలు ఉన్నాయని, ఎస్‌పీవీ ద్వారా అవి తెచ్చుకున్న రూ.95,462 కోట్ల రుణాలను ప్రభుత్వ అప్పులుగా చూపడం సరికాదని పేర్కొన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అప్పు రూ.21,029 వేల కోట్లు మాత్రమే ఉన్నదని.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ శ్వేతపత్రంలో దీనికి అదనంగా రూ.35 వేల కోట్లు జోడించి రూ.56,146 కోట్లుగా చూపారని చెప్పారు. ఉద్యమ నేత కేసీఆర్ తెలంగాణను దేశంలో ఏ రాష్ట్రానికీ అందనంత ఎత్తులో నిలిపారని, ఈ నిజాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దాచిపెట్టి తెలంగాణను దివాళాకోరు రాష్ట్రంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నదని నిప్పులు చెరిగారు. ఎవరెన్ని అభూత కల్పనలు సృష్టించినా, ఎన్ని సత్యాలను దాచేసి అసత్యాలను ప్రచారం చేసినా.. గత తొమ్మిదిన్నర ఏండ్లలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో రూ.50 లక్షల కోట్ల సంపదను సృష్టించిందనేది అక్షర సత్యమని, ప్రజల ముందు కనిపిస్తున్న నిజమని కేటీఆర్ స్పష్టం చేశారు.

తెలంగాణను బలిపెట్టొద్దు!

మొదటిపేజీ తరువాయి...

సహించబోమని హెచ్చరించారు. 'మా మీద రాజకీయ కక్ష ఉంటే తీర్చుకోండి. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చకండి' అ హితవు పలికారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో 'స్వయం పాలన ప్రారంభమైన తొమ్మిదిన్నరేండ్ల అనతికాలంలో కేసీఆర్ ప్రభుత్వ దార్శనికతతో యావత్ తెలంగాణ ప్రజలు చెమటోడ్చి సృష్టించిన సంపదపై స్వేదపత్రం' విడుదల చేశారు. ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్ నాయకత్వంలోని పరిపాలనను బద్నాం చేసే విధంగా, ప్రజల్లో అపోహలు, అనుమానాలు సృష్టించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రాల విడుదల పేరుతో బురదజల్లిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. శాసనసభలో తమ పార్టీ నాయకులు జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు, తాను కాంగ్రెస్ ప్రభుత్వ ఆరోపణలకు, విమర్శలకు దీటుగా సమాధానమిచ్చామని చెప్పారు. సభలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా గొంతునొక్కి శ్వేతపత్రాలు అని హడావుడి చేసి చివరికి వాయిదా వేసుకొని ప్రభుత్వం పారిపోయిందని విమర్శించారు. ప్రభుత్వ ఆరోపణలపై బాధ్యత కలిగిన పార్టీగా గత పదేండ్లలో తామేం చేశామో.. ఎట్లా చేశామో అనే విషయాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత తమ మీదే ఉన్నదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణకు ఆస్తులు సృష్టించటం మాత్రమే కాదని, తెలంగాణకు అస్థిత్వాన్నే సృష్టించిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు.

ఏ విచారణకైనా సిద్ధం

ప్రపంచంలోనే అతిపెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టుగా కాళేశ్వరం గుర్తింపు తెచ్చుకున్నదని, అది దాచేస్తే దాగని సత్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. ఒక్క బరాజ్‌లో ఎక్కడో ఒక దగ్గర చిన్న నిర్మాణ లోపం ఉంటే సరిచేయాలని, అదే సమయంలో 'జ్యుడీషియల్ ఎంక్వైరీ చేస్తాం' అని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. 'బరాబర్ విచారణ చేసుకోండి. తప్పు జరిగితే ఏ విచారణకైనా మేం సిద్ధం. దాంట్లో ఇబ్బందిలేదు. కానీ, ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిందించే పరిస్థితి తీసుకురాకండి' అని ప్రభుత్వానికి సూచించారు. 'మా మీద రాజకీయ కక్ష ఉంటే తీర్చుకోండి. మమ్మల్ని తిట్టండి. అంతేగానీ రాష్ట్ర, జాతి సంపదను మాత్రం అవమానించవద్దు. పెట్టిన శ్రమను, చిందించిన చెమటను చిన్నగ చేసి చూపొద్దు' అని హితవు పలికారు. కేసీఆర్ సృష్టించిన సంపదను విస్మరించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన డొల్ల రాజకీయాన్ని ఖండిస్తున్నామని అన్నారు. 'ఆస్తులంటే నిర్మాణాలే కాదు. ప్రజల్లో పెరిగిన జీవన ప్రమాణాలు. ప్రతి కుటుంబంలో పెరిగిన ప్రతిష్ఠ, ఆత్మవిశ్వాసం' అని కేటీఆర్ తేల్చి చెప్పారు.

నాటి తెలంగాణ వెతలివి..

- తెలంగాణ పది జిల్లాలతో రాష్ట్రంగా అవతరించినాడు హైదరాబాద్ మినహా మిగితా 9 జిల్లాలు కరువు ప్రాంతాలే. వీటికి బీఆర్‌జీఎఫ్ (బ్యాక్‌వర్డ్ రీజియన్ గ్రాంట్‌ఫండ్) నిధులు వచ్చేవి వాస్తవం కాదా? తెలంగాణ సంక్షుభిత పరిస్థితికి ఇంతకన్నా కొలమానం ఏం కావాలి?
- నల్లగొండ జిల్లా ప్రజలు ఫ్లోరోసిస్‌తో అతలాకుతలమైంది నిజం కాదా? ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నల్లగొండలో 2 లక్షల మంది ఫ్లోరోసిస్‌తో ఉండటం నోమాన్స్ ల్యాండ్ (మానవ రహిత ప్రాంతంగా) మిగిలిపోతుందని హెచ్చరించింది నిజం కాదా? నాటి ప్రధాని వాజపేయి టేబుల్ మీద అంశల స్వామిని జల సాధన సమితి నేత దుశ్చర్ల సత్యనారాయణ పడుకోబెట్టి 'ఇదీ మా దుస్థితి' అని నినదించినా సమస్య పరిష్కారం కాని దైన్యం నిజం కాదా?
- కిలోమీటర్ల కొద్దీ నడిచిపోయినా తాగునీరు దొరకని దుస్థితి. నెర్రలు బారిన నేలలు. పగలని గుండె లేదు. చెదరని స్వప్నం లేదు. తడవని కండ్లులేవు.
- దేశం మొత్తంలోనే మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిన జిల్లా. ఈ జిల్లా నుంచే 14 లక్షల మంది ప్రజలు వలస పోయేవారు. వేల సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు నిజం కాదా?
- ఇవాళ తెలంగాణకు 14 రాష్ట్రాల నుంచి 35 లక్షల మంది వచ్చి జీవనోపాధి పొందుతున్నది నిజం కాదా?

- కేటీఆర్ ప్రశ్నలివి

అందరితో ఒక్కడు.. అదే కేసీఆర్

1969 ఉద్యమంలో 370 మంది చనిపోయినా, ఆ తరువాత 30-32 ఏండ్లు సమైక్యవాదులు తెలంగాణపై చెలరేగిపోయినా తెలంగాణలో ఒక్క కాంగ్రెస్ నాయకుడు పెదవి విప్పలేదని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ అన్ని రంగాల్లో తీరని వివక్షకు, అన్యాయానికి గురైందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంతో మంది కవులు, కళాకారులు, ప్రొఫెసర్ జయశంకర్ లాంటి మేధావులంతా తమ ఆర్తిని, ఆవేదనను వ్యక్తం చేసినా ఎన్నడూ ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కండ్లల్లో ఇక నీళ్లింకిపోతయనే పరిస్థితుల్లో పిడికిలి బిగించి సమర శంఖం పూరించిన నాయకుడు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఒక్కరేనని స్పష్టం చేశారు. ఉద్యమంలో ఏనాడూలేని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఎన్నైనా మాట్లాడతారని, తమ వల్లనే తెలంగాణ వచ్చిందని గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. 'తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్ని దీక్షలు, ఆత్మ బలిదానాలు, సాగరహారాలు, మిలియన్ మార్చ్‌లు జరిగాయో తెలంగాణ సమాజానికి తెలుసు. ఇవాళ కొంత మంది నిర్బంధమని, నియంతృత్వమని అంటున్నారు. నిజానికి సమైక్య పాలకులే నియంతలు. తెలంగాణ రాష్ట్రం ఇస్తే అంధకారం అవుతుందని కట్టెలు పట్టుకొని చెప్పిన వాళ్లకు తొత్తులుగా పనిచేసినవాళ్లు మాపై నిందలేస్తారా?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. నేరపూరిత నిర్లక్ష్యం (క్రిమినల్ నెగ్లిజెన్సీ)తో, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో తెలంగాణను నాశనం చేసే ప్రయత్నం చేసింది ఎవరు? అని నిలదీశారు. సమైక్య రాష్ట్రంలో క్షమించలేని, క్షమించరాని, జీవన విధ్వంసానికి పాల్పడ్డా ఏ కాంగ్రెస్ నాయకుడు మాట వరుసకు కూడా నోరు విప్పి ప్రశ్నించలేదని ధ్వజమెత్తారు.

శ్వేతపత్రాల పేరుతో విఫలయత్నం

శ్వేతపత్రాల పేరుతో తెలంగాణను విఫల రాష్ట్రంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆర్థిక చిక్కులు చుట్టుముట్టి, రాజకీయ కుట్రలు పేట్రేగిపోయిన సందర్భాలను గుర్తు చేశారు. నాడు కూడా తెలంగాణను విఫల రాష్ట్రంగా చిత్రీకరించాలని కుట్ర చేశారని గుర్తుచేశారు. 'తెలంగాణ హిమాలయమంత ఎత్తులో ఆదర్శంగా రాష్ట్రంగా ఉన్నది. ఇప్పుడు మరోసారి రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లల్లోనే బెర్లిన్ గోడను కూల్చి ఈస్ట్, వెస్ట్ జర్మనీలను కలిపినట్టు రేపు తెలంగాణను తిరిగి ఆంధ్రాలో కలుపలేమా? అనే వాదనను బలంగా ఎదుర్కొన్నాం. రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్తిరపరిచే ప్రయత్నం, ఎమ్మెల్యేల కొనుగోలు ప్రయత్నం వంటి అనేక కుట్రలు జరిగినా వాటిని చీల్చుకొని తెలంగాణ నిటారుగా నిలబడింది' అని తెలిపారు.

మాకే అన్నీ తెలుసని ఏనాడూ అనుకోలే..

విభజన చట్టం అమలు కష్టాలు, ఉద్యోగుల పంపకాల్లో ఆటంకం, 2,700 మెగావాట్ల విద్యుత్తులోటు, వారసత్వంగా సంక్రమించిన సమస్యలు నాడు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని చుట్టుముట్టాయని కేటీఆర్ తెలిపారు. వీటన్నింటినీ అధిగమించేందుకు తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం ఎట్లా చేయాలనే సవాళ్లు ఎదుర్కొన్నామని చెప్పారు. చిమ్మ చీకట్ల నుంచి ముందుకు సాగేందుకు పటిష్ఠమైన ఆర్థిక క్రమశిక్షణతో.. ఆర్థిక ప్రణాళికలు రూపొందించుకున్నామని వివరించారు. బీహార్ రాష్ట్రంలో ఉన్న జీఆర్ రెడ్డి అనే ఆర్థిక వేత్తను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించుకొని, కోల్ ఇండియా సీఎండీగా పనిచేస్తున్న సీనియర్ అధికారి నర్సింగరావును సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీగా పెట్టుకొని ముందుకు సాగామని గుర్తుచేశారు. 'మాకే అన్నీ తెలుసు.. మేమే చాలా గొప్పవాళ్లం' అనే రీతిలో కాకుండా నేర్చుకోవాల్సింది ఇంకా ఎంతో ఉందని భావించామని తెలిపారు. స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు రచించుకొని ముందుకు సాగామని వివరించారు. అయితే తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కరోనా, పెద్దనోట్ల రద్దు వంటి ఆర్థిక ఆటంకాలతో బీఆర్ఎస్ పార్టీ నికరంగా పాలించింది ఆరున్నరేండ్లేనని పేర్కొన్నారు.

బట్ట..పొట్ట మొదటి ప్రాధాన్యం

ప్రాధాన్య క్రమాన్ని నిర్ణయించుకొని, అందుకు తగిన నిధుల కూర్పును అంచనావేసుకొని ఒక్కో మెట్టు ఎక్కుతూ తెలంగాణ ప్రగతి ప్రయాణాన్ని సాగించామని కేటీఆర్ తెలిపారు. వారసత్వంగా సంక్రమించిన అప్పుల లెక్కలు తీసి, వాస్తవిక ఆర్థిక క్రమశిక్షణ పాటించామని చెప్పారు.

మొదటి ప్రాధాన్యం -ఆసరాతో సంక్షేమం
రెండో ప్రాధాన్యం -విద్యుత్తు రంగం
మూడో ప్రాధాన్యం- వ్యవసాయ రంగం
నాలుగో ప్రాధాన్యం -చెరువుల పునరుద్ధరణ, తాగునీటి కల్పన
ఐదో ప్రాధాన్యం- పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి
ఆరో ప్రాధాన్యం -తెలంగాణకు హరితహారం

ఎన్నికలు ముఖ్యం కాదు.. రాబోయే తరాలు ముఖ్యం

బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికలు ముఖ్యం కాదని, రాబోయే తరాలే ముఖ్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. 'రాబోయే ఎన్నికలు కాదు.. రాబోయే తరాలను దృష్టిలో పెట్టుకొని పటిష్ఠమైన పునాదులు వేసుకున్నాం. కరోనా వచ్చినా, పెద్దనోట్ల రద్దు వంటి అనేక అవాంతరాలు వచ్చినా రాష్ట్ర సొంత ఆదాయ వనరులను పెంచుకుంటూ ముందుకు సాగాం. కేంద్ర ఆర్థిక పరిమితులకు (ఎఫ్ఆర్‌బీఎం) లోబడి అప్పులు తీసుకొచ్చాం. దేశంలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టాం. 2014లో తెలంగాణలో 21.92 శాతం ఉన్న బహుముఖ పేదరికాన్ని 5.8 శాతానికి తగ్గించాం. దేశంలో పేదరికాన్ని గణనీయంగా తగ్గించిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. ఇదే మా నిబద్ధతకు, నిఖార్సైన పాలనకు సంకేతం. తెలంగాణ ఆవిర్భవించిన పదేండ్లల్లోనే అద్భుతాలు సృష్టించింది. దేశానికే దిక్సూచీగా 10 శాతం గ్రీన్‌ఫండ్ పెట్టింది. తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నది అనేస్థాయికి తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌దే' అని స్పష్టంచేశారు. హైదరాబాద్ స్టేట్‌ను బలవంతంగా ఆంధ్రాలో కలుపుకొన్న 1956 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం సాధించేదాకా జరిగిన ఉద్యమఘట్టాలు, వాటి నేపథ్యాలను కేటీఆర్ తన పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా కండ్లకు కట్టారు.

వీటినెలా లెక్కిస్తరు?

- బీఆర్ అంబేద్కర్ విగ్రహ సమున్నత ఆత్మగౌరవాన్ని, విగ్రహ ఆస్తిని ఎట్లా లెక్కగడతారు?
- మిషన్ భగీరథతో ప్రతి ఇంటిలో నల్లా పెట్టి నీళ్లు ఇస్తే ఆడబిడ్డ చిరునవ్వును ఎట్లా వెలకడ్తారు?
- రైతుల స్వేదంతో వచ్చిన పంటకు ఎట్లా వెలకడ్తారు?
- అస్థిత్వానికి, ఆత్మ స్థైర్యానికి ఎట్లా వెలకడతారు?
- రైతు సంపదను ఎట్లా కొలుస్తరు? రైతు చెమటను ఎట్లా లెక్కిస్తరు?
- చెరువులు, రిజర్వాయర్లలో చెంగుచెంగున ఎగిరే చేపపిల్లల దరహాసాన్ని ఎట్లా లెక్కగడతరు?
- ముదిరాజ్, గంగపుత్ర సోదరులు చెరువులో చిందించిన చెమటను ఎట్లా లెక్కగడతరు?
- గొల్ల, కురుమ సోదరులకు సబ్సీడీ గొర్రెల పంపిణీతో పెరిగిన మందల దరహాసాన్ని ఎట్లా కొలుస్తరు?
- పాడిరైతులు సృష్టించిన సంపదను ఎట్లా లెక్కిస్తరు?
- పవర్‌కట్ లేకుండా 24 గంటలు పరిశ్రమలకు కరెంట్ ఇవ్వటం ద్వారా వచ్చిన పారిశ్రామికవేత్తల సంతోషాన్ని ఎట్లా కొలుస్తరు?
- ఆసరా పింఛన్‌తో ధీమా పొందిన ముసలవ్వ చిరునవ్వును ఎట్లా కొలుస్తరు?
- ఆసరాతో తన ఒంటరి జీవితానికి అండగా దొరికిందని సంతోషంగా ఉన్న ఒంటరి మహిళ ధైర్యాన్ని ఎట్లా కొలుస్తరు?
- కల్యాణలక్ష్మితో పెండ్లి చేసుకున్న చెల్లెలి నవ్వును ఎట్లా కొ